సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 26 । నవంబర్ । 2023



వర్సిటీలో చదివేదె'లా'?

లాసెట్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లకు అంబేడ్కర్ వర్సిటీ న్యాయ కళాశాల పేరు కనిపించడం లేదు. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ ముగిసింది. విజేతలకు డీఈఓ బహుమతులు అందజేశారు.

- 8లో

నేడు విభిన్న ప్రతిభావంతుల పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరగనున్నాయి. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ పోటీల కోసం క్రీడామైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీపీటీవో

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 నుంచి 11గంటల వరకూ డయల్ యువర్ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీపీటీవో ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 9959225603 నంబర్‌కు ఫోన్ చేసి బస్సు రూట్లు, సమస్యలు, సలహాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 21 మంది ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ శిక్షణా సంస్థలో జరిగిన ఈ జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 75 మంది హాజరుకాగా.. 39 మంది షార్ట్‌లిస్టు చేయగా, చివరకు 21 మంది నిరుద్యోగ యువత ఎంపికైనట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. మెడ్‌ప్లస్ కంపెనీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, రైతుబంధు ఎంటర్‌ప్రైజెస్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు.కార్యక్రమంలో డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు, జిల్లా ఉపాధి కార్యాలయ యంగ్ ప్రొఫెసర్ మన్మధనాథ్ పాతిక్, హెచ్‌ఆర్‌లు పవన్‌కుమార్, ఎస్.ఎస్.శ్రీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ దుర్గా ప్రసాదరావుకు జ్ఞాపికలు అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రముఖ క్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్‌లు శనివారం ఉదయం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల బృందం పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరించారు. అనివేటి మండపంలో వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, వన్‌టౌన్ సీఐ సన్యాసినాయుడు, ఎస్సై బలివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వరిపంట ఆరబెట్టుకుంటున్న రైతులు

● ఆరుగాలం శ్రమ.. ఆరబెడుతూ..

ఆరుగాలం శ్రమించి కష్టం ధారపోసి పండించిన ధాన్యాన్ని భద్రపరిచే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల వరిపంట దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. పంట చేతికందడంతో యంత్రాల సాయంతో నూర్పిడులు పూర్తి చేశారు. పంట కోతలు, మోతలు, కుప్పలు పెట్టే పనుల్లో అన్నదాతలు బిజీగా గడుపుతున్నారు. మరోవైపు ఆకాశం మేఘావృతమై ఉండటంతో ధాన్యం దెబ్బతినకుండా ఆరబెడుతున్నారు. పలాస-కాశీబుగ్గ పరిసర గ్రామాల్లో శనివారం ఈ చిత్రాలు కనిపించాయి.

– కాశీబుగ్గ







పొందూరు జనావళి చెంతకు ▸ నాగావళి

- రూ.50 కోట్లతో సమగ్ర రక్షిత మంచి నీటి పథకం
- స్పీకర్ ముందు చూపుతో పొందూరు మండలానికి మరింత మేలు
- వేసవి ఇక్కట్లు, భవిష్యత్ అవసరాలను అధిగమించేందుకు మంజూరు
- డీపీఆర్ సిద్ధం..త్వరలో టెండర్ల ఖరారు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వేసవి వస్తే పొందూరు మండలంలో కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వేసవి తీవ్రత పెరిగే కొద్దీ నీటి వనరులు తగ్గుతున్నాయి. ప్రతి వ్యక్తికి అవసరం మేరకు తాగునీటిని అందించలేని దుస్థితి నెలకుంటోంది. భవిష్యత్‌లో సమస్య మరింత ఇబ్బందికరంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు అధికార యంత్రాంగంతో పాటు స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టి సారించారు. నాగావళి జలాలను అక్కడికి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. దానిలో భాగంగా రూ.50 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి స్కీమ్‌ను మంజూరు చేయించారు. ఇప్పటికే డీపీఆర్ తయారైంది. టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడమే మిగిలి ఉంది.



ఎలివేటెడ్ బ్యాలన్స్‌డ్ రిజర్వాయర్ నిర్మించనున్న రాపాక కొండ

25 పంచాయతీలకు ప్రయోజనం..

మండలంలో 90వేలకు పైగా జనాభా ఉన్నారు. ఒక్కొక్కరికీ రోజుకు 55 లీటర్ల నీరు అందించాలంటే 70 లక్షల లీటర్ల నీరు అవసరం. వర్షాకాలం, శీతాకాలంలో ఫర్వాలేకపోయినా వేసవి కాలం వచ్చేసరికి కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి. భవిష్యత్ మరింత ఇబ్బందికరంగా మారనుంది. దీన్ని ముందే గుర్తించి, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారీ రక్షిత మంచినీటి ప్రాజెక్టును ఇక్కడ నిర్మించతలపెట్టారు. యుద్ధ ప్రాతిపదికన రూ.50కోట్లతో మంజూరు చేయించారు. ఇప్పటికే మండలంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించేందుకు ఎక్కడికక్కడ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఇప్పుడా ట్యాంకులకు పూర్తి స్థాయిలో నీరు వచ్చేలా రూ.50 కోట్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నా రు. దీంతో మండలంలోని 25 పంచాయతీల ప్రజలకు ప్రయోజనం చూకూరనుంది.

బృహత్తర ప్రాజెక్టు..

రెండు ఫేజ్‌లలో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురానున్నారు. మొదటి ఫేజ్‌లో కొన్ని గ్రామాలకు, రెండో ఫేజ్‌లో మిగతా గ్రామాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. తొలుత పొందూరు మండలంలోని గంగ్రేడు-ఆమదాలవలస మండలంలోని తొగరాం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న నాగావళి నదిలో ఊటబావులను నిర్మిస్తారు. నది మధ్యలో గ్యాలరీ ఏర్పాటు చేసి పంపింగ్ ద్వారా సుమారు 14 కిలోమీటర్ల దూరంలోని రాపాక కొండ మీద నిర్మించనున్న 2 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ బ్యాలన్స్‌డ్ రిజర్వాయర్(ఈఎల్‌బీఆర్)కు పంపిస్తారు. అక్కడి నుంచి గ్రామాల్లో ఉన్న ట్యాంకులకు విడుదల చేయనున్నారు. దీనికి అవసరమైన 120 కేఎల్ సామర్థ్యం గల రెండు ఓవర్ హెడ్ బ్యాలన్స్‌డ్ రిజర్వాయర్లు కూడా నిర్మిస్తున్నారు. పైపులైన్ కోసం రైల్వే క్రాసింగ్, హైవే క్రాసింగ్ పనులు కూడా చేయనున్నారు.



పొందూరు ఏరియల్ వ్యూ

ఫేజ్‌ల వారీగా రక్షిత నీరు



- మొదటి ఫేజ్‌లో నాగావళి నది నుంచి రాపాక కొండకు వెళ్లే మార్గ మధ్యలో తాడివలస, వెంకంపేట, గోకర్నపల్లి,గోరింట, తుంగపేట, కొంచాడ, తదితర గ్రామాలకు నీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. రాపాక కొండపై ఏర్పాటు చేసిన ఈఎల్‌బీఆర్ ద్వారా పొందూరు టౌన్, కృష్ణాపురం, లోలుగు, దళ్లిపేట పిల్లలవలస, రెడ్డిపేట, తాణెం, నందివాడ, నర్సాపురం అగ్రహారం, కేశవదాసుపురం, వీఆర్ గూడెం, ధర్మపురం, బురిడి కంచరాం తదితర గ్రామాలకు నీరు అందించనున్నారు.
- రెండో ఫేజ్‌లో బొడ్డేపల్లి మీదుగా మిగిలిన గ్రామాలకు సరఫరా చేస్తారు. వాటి కోసం తండ్యాం కొండపై ఓహెచ్‌బీఆర్(ఓవర్ హెడ్ బ్యాలన్స్‌డ్ రిజర్వాయర్) నిర్మించి మిగతా గ్రామాలకు సురక్షిత మంచినీరు అందనుంది.

డీపీఆర్ సిద్ధం..

- రూ.50 కోట్ల సమగ్ర రక్షిత మంచినీటి స్కీమ్‌కు సంబంధించి ఇప్పటికే డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశారు.
- ఎక్కడెక్కడ ఏ విధమైన పనులు చేపట్టాలి.. ఎటువంటి సోర్సెస్ ఏర్పాటు చేసుకోవాలి.. రైల్వే క్రాసింగ్, హైవే క్రాసింగ్ తదితర పనులు ఎక్కడెక్కడ చేపట్టాలన్న దానిపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి డీపీఆర్ తయారు చేశారు.
- దీనిని ఉన్నతాధికారులు పరిశీలించి ఖరారు చేయడంతో పాటు టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టనున్నారు. డిసెంబర్‌లో ఈ స్కీమ్ పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

ముందు చూపుతో..



చరిత్రలో నిలిచిపోయే స్కీమ్ ఇది. భవిష్యత్‌లో తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు పొందూరు మండలంలో రూ.50కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తున్నాం. తాగునీటి సమస్యలు, వేసవిలో అడుగంటుతున్న జలాల దృష్ట్యా ఈ ప్రాజెక్టును నిర్మించనున్నాం. ప్రతి వ్యక్తికి రోజుకు 55 లీటర్ల తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఫేజ్‌ల వారీగా మండలంలోని అన్ని గ్రామాలకు పైపులైన్ ద్వారా ఇంటింటి కుళాయిలతో తాగునీరు అందిస్తాం.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

సంక్షేమ పథం



20 ఏళ్ల కల నెలవేరింది



మేం 20 ఏళ్లుగా టెక్కలి గొల్లవీధిలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాం. నా భర్త ప్రఫుల్లో కుమార్ మిల్లు కలాసీ పనిచేస్తున్నారు. కష్టపడిన సంపాదించిన డబ్బులు ఆహారం, అద్దెలకే సరిపోయేవి. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నాలాంటి పేద ప్రజలను గుర్తించి ఇంటి స్థలం ఇచ్చారు. సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉంది.

– జయంతి మహాపాత్రో, జగనన్న ఇల్లు లబ్ధిదారు, టెక్కలి

విద్యార్థుల సంఖ్య పెరిగింది



పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

మనబడి నాడు-నేడు మొదటి విడతలో రూ.16 లక్షల నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టాం. ఆహ్లాదకర వాతావరణం కల్పించాం. విద్యా సంస్కరణలు పక్కాగా అమలు చేస్తున్నాం. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం మా పాఠశాలలో 72 మంది పిల్లలు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యా బోధన, సౌకర్యాలు లభిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– హరిపురం ఆనందరావు, హెచ్‌ఎం, కోటబొమ్మాళి ప్రాథమిక పాఠశాల

ఎన్నికల్లో సెక్టార్ అధికారులే కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారులదే కీలక పాత్ర అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారుల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా సెక్టార్ అధికారులను నియమించి శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు వచ్చాయని చెప్పారు. రిటర్నింగ్ అధికారులకు సెక్టార్ అధికారులు అనుసంధానమై ఉంటారని, ఒక్కొక్క రిటర్నింగ్ అధికారి కింద 20 నుంచి 30 సెక్టార్లు ఉంటాయని, ఒక్కో సెక్టార్ అధికారికి 10 నుంచి 15 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందని వివరించారు. వీరికి ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఇస్తామని, తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ స్వయంగా సందర్శించి వసతులను, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని, సమస్యాత్మక అంశాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సామాజిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు, శాంతిభద్రతలను పర్యవేక్షించాలన్నారు. బూత్ లెవల్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్‌హెచ్‌వోలు గ్రామాల్లో రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. ప్రతి ఎన్నికలనూ కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ తప్పిదాలకు ఎటువంటి ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. శిక్షణకు 139 మంది అధికారులకు గాను 21 మంది గైర్హాజరయ్యారని, వారంతా ఈనెల 28న జరిగే శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనీ జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్డీఓ సీహెచ్.రంగయ్య ఎన్నికల నిర్వహణ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, శ్రీకాకుళం, నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల సెక్టార్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

రేపే చిలకపాలెంలో బస్సుయాత్ర

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో చిలకపాలెం-పొందూరు రోడ్డులో ఈ నెల 27న నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ, రాష్ట్ర సామాజిక సాధికార బస్సు యాత్ర పరిశీలకుడు లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. బస్సుయాత్ర నిర్వహించనున్న స్థలాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. నియోజకవర్గం నుంచి అన్ని గ్రామాల ప్రజలు హాజరు కావాలని కోరారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం కోసం వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందని చెప్పారు. అర్హులందరికీ నవరత్నాలు చేరాయని తెలిపారు. ప్రతిపక్షాల విషప్రచారం తిప్పికొట్టి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజు, మురళీధర్‌బాబా, వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, సురేష్‌బాబు, ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ట్రాఫిక్ మళ్లింపు..

బస్సుయాత్ర నేపథ్యంలో ఈ నెల 27న ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు. రాజాం, పొందూరు నుంచి శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లే వాహనాలు రాపాక కూడలి నుంచి కింతలి రోడ్డు మీదుగా సింహద్వారం వద్దకు చేరుకుని వెళతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి పొందూరు, రాజాం వైపు వెళ్లే వాహనాలు సింహద్వారా వద్ద కింతలి రోడ్డు నుంచి పొందూరు, రాజాం వెళతాయని తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం నుంచి చిలకపాలెం రోడ్డులో రాజాం వెళ్లే వాహనాలు హైవే పైనుంచి సింహద్వారం వద్దకు చేరి కింతలి రోడ్డు మీదుగా పొందూరు, రాజాం వెళతాయని వివరించారు. ఉదయం ఆరు నుంచి రాత్రి ఏడు వరకు ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని చెప్పారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన కంటైనర్



ప్రమాదానికి గురైన కంటైనర్

మందస: మండలంలో జాతీయ రహదారిపై శనివారం ఓ కంటైనర్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను డ్రైవర్ చాకచక్యంగా తప్పించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఈ లారీ ప్రమాదవశాత్తూ బాలిగాం సమీపంలో జాతీయ రహదారిపై నుంచి పొలాల్లోకి వెళ్లిపోయింది. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా లారీ నుంచి బయటకు రావడంతో ఘటనా స్థలంలో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

శబరిమల ప్రత్యేక రైలు ప్రారంభం



ప్రత్యేక రైలును ప్రారంభిస్తున్న ఎంపీ

ఆమదాలవలస : శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) నుంచి కొల్లాం రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును శనివారం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ మొదలవలస రవి, రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎల్.శివశంకర్, మెండ దాసునాయుడు, కొర్ను నాగార్జున ప్రతాప్, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, సనపల చెల్లం నాయుడు, గొండు రమణ, లంక నాగరాజు, బోనెల అప్పారావు, నాగళ్ల మురళీధర్, గుడ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పట్టపగలే దొంగతనం

గార: మండలంలోని లింగాలవలసకు చెందిన పిట్ట అప్పలరాజు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలవలస సచివాలయం ఎదురుగా ఉన్న కాలనీలో ఉంటున్న అప్పలరాజు దంపతులు ఇద్దరు పిల్లలను పాఠశాలకు పంపించి ఉదయం 9 తర్వాత వ్యవసాయ పనులకు వెళ్లిపోయారు. పక్క ఇంటిలో ఉన్న అత్త కిల్లాన సూరమ్మ కూడా శ్రీకూర్మం వెళ్లింది. సాయంత్రం వచ్చి చూసేసరికి దుండగులు చొరబడి బీరువా తలుపులు విరిచి అందులో రూ. 25 వేలు, అర తులం చెవి బుట్టలు, పావు బంగారం బిల్ల, శతమానం, ఎల్ఐసీ బాండు, పాసు పుస్తకాలు పట్టుకెళ్లిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాశీబుగ్గలో దొంగల హల్‌చల్



తెరిచి ఉన్న షట్టర్ తాళం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్‌లో దొంగలు హల్‌చల్ సృష్టించారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పది దుకాణాల తాళాలు బద్దలు గొట్టి నగదు దోచుకున్నారు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తాళాలు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి కాశీబుగ్గ పోలీసులను ఆశ్రయించారు. క్రైం పోలీసులు విచారణ చేపడుతున్నారు. సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు.

వర్సిటీలో చదివేదెలా?

- లాసెట్ కౌన్సెలింగ్ జాబితాలో కనిపించని అంబేడ్కర్ వర్సిటీ న్యాయ కళాశాల
- గత ఏడాది సమస్య పునరావృతం
- ఆందోళనలో విద్యార్థులు



డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని మహాత్మా జ్యోతిరావుపూలే న్యాయ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్:

జిల్లాలో చాలా మంది విద్యార్థులు ఎచ్చెర్లలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య చదవాలన్న లక్ష్యంతో లాసెట్ రాశారు. అయితే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయం విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. లాసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆప్షన్ల ఎంపికలో వర్సిటీ లా కళాశాల కనిపించకపోవడంతో అందరూ అయోమయం చెందుతున్నారు.

రూ.15 లక్షలు చెల్లించినా..

న్యాయవిద్యలో ప్రవేశాలకు సంబంధించి ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ మేరకు లాసెట్ - 2023 కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మూడేళ్ల న్యాయ విద్య ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల న్యాయ విద్య ఎల్ఎల్‌బీ, రెండేళ్ల పీజీ కోర్సు ఎల్ఎల్ఎంలకు ప్రవేశాలు కల్పిస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని మహాత్మా జ్యోతిరావు పూలే న్యాయ కళాశాలలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో 66 సీట్లు ఉన్నాయి. వర్సిటీ అఫిలియేషన్ కళాశాల ఎంపీఆర్ లా కాలేజీలో మూడేళ్ల లా 88, ఐదేళ్ల లా కోర్సులో 88 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే లాసెట్ కౌన్సెలింగ్‌లో బీఆర్ఏయూ న్యాయ కళాశాలకు ఆప్షన్లు కనిపించడం లేదు. జిల్లాలో ఒక్క ప్రైవేట్ కళాశాల ఎంపీఆర్ కాలేజీ మాత్రమే చూపిస్తోంది. గత ఏడాది కూడా ఇదే సమస్యరాగా, రెండో విడత కౌన్సెలింగ్‌లో సమస్య పరిష్కరించారు. అప్పట్లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు సమస్యరాగా, రూ.15 లక్షలు చెల్లించారు. దీంతో బార్ కౌన్సిల్ లాఫ్ ఇండియా గుర్తింపు ఇచ్చింది. మళ్లీ ఈ ఏడాదికి గుర్తింపు కొనసాగించలేదు. దీంతో కౌన్సెలింగ్ జాబితాలో లేదు.

అంతా అయోమయం..



వెబ్‌సైట్‌లో కనిపించని వర్సిటీ కళాశాల

లాసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 18 నుంచి 22 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తిచేశారు. 23 నుంచి ఆప్షన్లు ఎంపిక ప్రారంభమైంది. చివరి రోజు శనివారం. సాయంత్రం వరకు ఆప్షన్ కనిపించలేదు. ప్రైవేట్ కళాశాల జాబితాలో ఉండి ప్రభుత్వ కళాశాల లేకపోవటం విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. ఆప్షన్లు మార్పుకు ఆదివారం వరకు అవకాశం ఉంది. జాబితాల్లో వర్సిటీ కళాశాల కనిపిస్తే విద్యార్థులు ఆప్షన్ ఇచ్చేందుకు అవకాశం లభిస్తుంది. లేదంటే ఇతర కళాశాలలే దిక్కు. రెగ్యులర్ పోస్టుల నియామకంకు సైతం ప్రభుత్వం నోటిఫికేషన్ జారి చేసింది. ప్రయివేట్ కళాశాలకు గుర్తింపు ఇస్తున్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రభుత్వ కళాశాలను నిర్లక్ష్యం చేయటం విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తుంది.

సమస్య పరిష్కరిస్తాం..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య కోర్సులో ప్రవేశాలకు కృషి చేస్తున్నాం. ఉన్నత విద్యా మండలి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దృష్టికి సమస్య తీసుకెళ్లాం. గత ఏడాది ఇలాంటి సమస్య వస్తే రూ.15 లక్షలు చెల్లించి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు కమిటీకి ఆహ్వానించాం. వారు వర్చువల్‌గా పరిశీలించి గుర్తింపు ఇచ్చారు. ఈ ఏడాది సైతం ప్రత్యేకంగా సమస్యపై దృష్టిపెట్టాం.

– ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ట్రోఫీ అందుకుంటున్న అండర్ -17 విజేత శ్రీకాకుళం జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ
- వివిధ కేటగిరీల్లో విజేత జట్లుగా చిత్తూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం
- బహుమతులు అందజేసిన డీఈఓ



అండర్ - 19 విజేత విశాఖపట్నం జట్టు



అండర్ - 14 విజేత చిత్తూరు జట్టు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 67 ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-14, 17, 19 స్కూల్‌గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఇక్కడి 11 కోర్టుల్లో నిర్వాహకులు పక్కా ప్రణాళికతో పోటీలు నిర్వహించివిజేతలకు బహుమతులు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 390 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నువ్వా నేనా అన్నట్లు పోటీలు సాగాయి. అండర్-14 విభాగంలో చిత్తూరు, శ్రీకాకుళం, అండర్-17 విభాగంలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, అండర్-19 విభాగంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జట్లు విన్నర్, రన్నర్లుగా నిలిచాయి. ఆయా జట్లకు అధికారులు ట్రోఫీలు అందజేశారు. ముగింపు సభలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు, క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభ గుర్తించేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బాల్‌బ్యాడ్మింట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీవీజీ రాజు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పైడి భాస్కరరావు, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి.వి.రమణ, అబ్జర్వర్ అజేయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తకోట సూర్యారావు, పైడి నర్సింగరావు, మాజీ సర్పంచ్ పొందూరు భీమారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరబ్రహ్మ పురస్కారాలకు ఆహ్వానం

ఇచ్ఛాపురం రూరల్/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉమ్మడి రాష్ట్రాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు తమ సంస్థ ద్వారా 'అక్షర బ్రహ్మ, సేవా బ్రహ్మ' అవార్డులు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆల్ ద బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ ఇ.ఎస్.ఎస్.నారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యా, విజ్ఞాన బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, క్రీడా రంగాలలో అత్యుత్తమ క్రమశిక్షణతో సేవలందిస్తున్నవారు ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో నాలుగు పాస్ పోర్టు సైజు ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ఎంట్రీలను డిసెంబర్ 10లోగా 'ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ,' డోర్ నెం.1-20-164, గోకులనగర్, వెంకటాపురం పోస్టు, తిరుమల గిరి, వెంకటాపురం, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపించాలని, పూర్తి వివరాలకు 9652347207 నంబరును సంప్రదించాలని కోరారు.

27, 28 తేదీల్లో యోగా, వెయిట్‌లిఫ్టింగ్ ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాలు పోటీల్లో పాల్గొనే యోగా, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయం, రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరగనున్న పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 27న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం యోగా హాల్లో యోగా క్రీడాకారుల ఎంపిక, 28న శ్రీకాకుళం ఇండోర్ స్టేడియంలో పురుషుల వెయిట్ లిఫ్టింగ్‌లో 55, 61, 67, 73, 81 కిలోల విభాగాలు, మహిళల కేటగిరీలో 45, 49, 55, 45 కిలోల విభాగాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు. ధ్రువీకరణతో డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరు కావచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డు జంక్షన్ నాలుగరోడ్ల కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సింగపల్లి గ్రామానికి చెందిన రట్టి చక్రపాణి ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వస్తుండగా మెళియాపుట్టి జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో చక్రపాణికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ రిఫర్ చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల సొమ్ముతో మహిళ పరారీ!

టెక్కలి: స్థానిక రోటరీనగర్‌లో చిట్టీలు నిర్వహిస్తున్న ఓ మహిళ నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో సొమ్ము కట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న ఉద్యోగులు, మధ్య తరగతి వారి నుంచి చిట్టీల రూపంలో సుమారు రూ.2 కోట్లు వసూలు చేసిన సదరు మహిళ నాలుగు రోజులుగా ఆచూకీ లేకపోవడం, ఫోన్ సమాచారం సైతం లేకపోవడం గందరగోళంగా మారింది. అయితే ఇప్పటి వరకు ఎవరూ పోలీసులను ఆశ్రయించలేదు.

'ఆడుదాం ఆంధ్రా' కిట్లు విడుదల



క్రీడాకిట్లను విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కంచిలిలో 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్‌కు సంబంధించి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మంజూరు చేసిన కిట్లను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పార్టీ సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు, నర్తు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సద్దుమణిగిన 'లింగిడి' పాట వివాదం



జానపద కళాకారుడు మల్లేసుకు నగదు అందజేస్తున్న దృశ్యం

మందస: కోటబొమ్మాళి సినిమాలోని లింగిడి, లింగిడి పాట వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక జోక్యంతో జానపద కళాకారుడు గువ్వాడ మల్లేసుకు న్యాయం జరిగింది. కవిటి మండలానికి చెందిన గువ్వాడ మల్లేసు అనే కళాకారుడు జానపద పాటలను పాడుకుంటూ జీవనం గడుపుతున్నాడు. లింగిడి, లింగిడి... లింగిడి కింద జంగిడి అనే పాట ఎక్కువగా పాడుతూ ఈ ప్రాంతీయులకు ఆనందపరిచేవాడు. అయితే ఈ సాహిత్యంతో పాటు బాణీని కూడా కోటబొమ్మాళి సినిమాలో వాడుకున్నారని ఆయన ఆరోపించారు. దీంతో కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, గౌరవసలహాదారుడు డాక్టర్ కుమార్‌నాయక్ తదితరులు సినీ నిర్మాతలను సంప్రదించి, సమస్యను వారి ముందు ఉంచారు. మందస మండలం హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో శనివారం ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. నిర్మాతలు బన్ని వాసు, కొప్పినేని విద్య కళాకారుడు మల్లేసుకు రూ.50వేలు ఇవ్వడానికి అంగీకరించారు. ఈ నగదును సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక కోశాధికారి మామిడి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తిని రామారావు, ఉపాధ్యక్షుడు దున్న రామారావు, గౌరవాధ్యక్షుడు బొడ్డు గాంధీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు సమక్షంలో మల్లేసుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రాచీన జానపదాలు, కళాఖండాలు, రూపాలు, కవితలు, జానపద కళలు నిక్షిప్తమై ఉన్నాయని, వీటిని పరిరక్షించడానికి కళావేదిక శతవిధాలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో దున్న హరికృష్ణ, పోతనపల్లి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

వారం వ్యవధిలోనే ధాన్యం డబ్బులు జమ



మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ డీఎం శ్రీనివాసులు

శ్రీకాకుళం రూరల్: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం ఎన్.శ్రీనివాసులు తెలిపారు. కళ్లేపల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం టెక్నికల్ అసిస్టెంట్లకు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ధాన్యం శాంపిల్ సేకరణ, తేమశాతం పరీక్ష, షెడ్యూల్ చేయడం, మొబైల్ అప్లికేషన్ నింపే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రకం వంద కేజీలకు రూ.2183, గ్రేడ్-ఏ రకం వంద కేజీలకు రూ.2203 చెల్లిస్తున్నట్లు చెప్పారు. మండల వ్యవసాయాధికారి ఉషా కుమారి మాట్లాడుతూ రైతులు ముందుగా విలేజ్ అసిస్టెంట్‌ను సంప్రదించి షెడ్యూల్ తీసుకోవాలన్నారు. జీపీఎస్ ఉన్న వాహనాలలోనే ధాన్యం లోడింగ్ చేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ సహాయకులు విశాలాక్షి, ప్రియాంక, సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

బీసీ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు, బీసీ సంఘ నాయకులు

కాశీబుగ్గ: బీసీల రాజ్యాధికారం కోసం మరో స్వాతంత్ర్య పోరాట రథయాత్ర పేరిట డిసెంబరు 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న బీసీల పోరాటయాత్రను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను పలాసలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతిరాజు, గొర్రెలు, మేకల సహకార అభివృద్ధి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాపాక చిన్నారావు, సంఘ నాయకులు అమరుల్లా బెగ్, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, పాలిన ప్రసాద్, తిప్పాన గాంధీ, సిగురువలస జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి 'రిలీఫ్'



సుజాతకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: మండలంలోని తలసముద్రం పంచాయతీ సర్పంచ్ భావన శ్రీను జూన్ 26న అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందారు. అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో నేరుగా మాట్లాడి సమస్య వివరించారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.7లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో శ్రీను భార్య, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు భావన సుజాతకు శనివారం అందజేశారు.

108 వాహనంలో ప్రసవం



బిడ్డను చూపుతున్న సిబ్బంది

టెక్కలి రూరల్: మండలంలోని పాతనౌపాడకు చెందిన సారవకోట వెన్నెల అనే గర్భిణికి శనివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది ఆమెను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా రైల్వేట్రాక్ దాటిన తర్వాత నొప్పులు ఎక్కువ కావడంతో అప్రమత్తమైన ఈఎంటీ దేవాది శ్రీనివాసరావు, పైలట్ జోగి ఆదినారాయణలు వాహనాన్ని ఆపి ప్రసవం చేయించారు. వెన్నెల పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబసభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.